


పాఠశాలలో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు(ఫైల్)

ఉప ముఖ్యమంత్రి ఆదేశాలు బేఖాతర్

- గురుకులాల్లో కానరాని కలెక్టర్, డీఎంహెచ్‌వో రాత్రి బస
- మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటనలు అసలే లేవు..

6


అసంపూర్తిగా ఉన్న వంతెన

ఎట్టకేలకు వంతెన పనులకు మోక్షం

- తక్కళ్లపల్లి-సిరికొండ ప్రజల హర్షం
- ఆర్‌అండ్‌బీ శాఖతో రద్దయిన టెండర్ పునరుద్ధరణ
- రెండు రోజుల్లో పనుల ప్రారంభం

8

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

- నారాయణ, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

జగిత్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో ఉత్తమఫలితాల సాధనపై ప్రత్యేక దృష్టి సారించామని, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి నారాయణ అన్నారు. ఫిబ్రవరి 3వతేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 5వతేదీ నుంచి వార్షిక పరీక్షలు జరు గనున్న నేపథ్యంలో ఆయన 'ఆంధ్ర జ్యోతి' ఇంటర్వ్యూలో వివరాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఇంటర్ విద్యా వ్యవస్థ పరిస్థితి ఎలా ఉంది..?

అధికారి: జిల్లా వ్యాప్తంగా 15 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మేడిపల్లి మండల కేంద్రానికి ఒకటి ప్రభుత్వ జూని యర్ కళాశాలను మంజూరు చేసింది. సాధ్యమైనంత తొందరలో కళాశాలను ప్రారంభించడానికి ప్రయత్నాలు చేస్తున్నాము. దీనికి తోడు 21 పలు ప్రైవేటు జూనియర్ కళాశాలలు, కస్తూర్బా పాఠశాలలు, మోడల్ పాఠశాలలు, గురుకు లాల్లో ఇంటర్ విద్యను అందిస్తున్నాము. ప్రభుత్వ కళాశాలల్లో సుమారు 5 వేల మంది విద్యార్థులున్నారు.

ఆంధ్రజ్యోతి : పరీక్షల టైం టేబుల్ వచ్చింది..ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు..?

అధికారి: వచ్చే యేడాది ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 5వ తేదీ నుంచి వార్షిక పరీక్షలు నిర్వహించను న్నాము. ఇందుకు అవసరమైన కేంద్రాలు ఏర్పాటు, మౌలిక వసతులు అంశాల పై దృష్టి సారించాము. ప్రస్తుతం సెంటర్ ఫార్మేషన్ పనులు జరుగుతున్నాయి.

ఆంధ్రజ్యోతి : విద్యార్థులను పరీక్షలకు ఎలా సిద్ధం చేస్తున్నారు..?

అధికారి: ప్రతీ కళాశాలలో ప్రత్యేక స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తున్నాము. కొన్ని కళాశాలల్లో ఒక పూట, మరికొన్ని కళాశాలల్లో రెండు పూటలు నిర్వహిస్తున్నారు. వచ్చే నెల ఒకటవ తేదీ నుంచి ఉదయం 9 గంటల నుంచి 9.45 వరకు, మళ్లీ మధ్యాహ్నం 4 నుంచి 4.45 గంటల వరకు ప్రత్యేక స్టడీ అవర్స్‌ను నిర్వహిస్తాము. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారిస్తున్నాము. సబ్జెక్టు లెక్చరర్లకు లక్ష్యాలను నిర్వహించి దిశా నిర్దేశం చేశాము.

ఆంధ్రజ్యోతి : పరీక్షల నిర్వహణకు నిధులు అందుబాటులో ఉన్నాయా..?

అధికారి: దాదాపుగా మూడు, నాలుగు సంవత్సరాలు ప్రాక్టికల్స్‌కు అవసరమైన కెమికల్స్, ల్యాబ్ పరికరాల కొనుగోలుకు నిధులు మంజూరు కాలేదు. ఇటీవల ఒక్కో కళాశాలకు రూ. 25 వేల చొప్పున నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో అవసరమైన కెమికల్స్, ల్యాబ్ పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేవు.

ఆంధ్రజ్యోతి : ప్రాక్టికల్ పరీక్షలకు ఎంత మంది హాజరు కానున్నారు..?

అధికారి : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో కలిపి ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీ గ్రూపులో 2,746, బైపీసీ గ్రూపులో 1,287 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో ప్రభుత్వ కళాశాలల్లో ఎంపీసీ గ్రూపులో 520 మంది. బైపీసీ గ్రూపులో 358 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకానున్నారు.

ఆంధ్రజ్యోతి : విద్యార్థులు, తల్లిదండ్రులకు మీరిచ్చే సలహాలు ..?

అధికారి: కళాశాలల ప్రిన్సిపల్స్‌తో ఇప్పటివరకు రెండు సార్లు సన్నాహక సమావేశాలు నిర్వహించాము. విద్యార్థుల హాజరుశాతం పెంచాలని సూచించాము. దీర్ఘకాలికంగా హాజరుకాని విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించాము. ఇప్పటికే పలు కళాశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు పూర్తి చేశాము. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నాము.

ఆంధ్రజ్యోతి : పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారు కదా...నివారణ ఎలా..?

అధికారి : విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబరు 14416ను ఏర్పాటు చేశాము. విద్యార్థులు ఫోన్ చేసి తగిన సలహాలు, సూచనలు తీసుకోవచ్చు. మానసిక ఒత్తిడికి గుర వకుండా ప్రతి కళాశాలలోనూ కౌన్సిలర్లను నియమించాము. వీరంతా విద్యార్థుల మానసిక స్థితిని పరిశీలిస్తూ దిశా నిర్దేశం చేస్తున్నారు.

సహ చట్టం జిల్లా అధ్యక్షుడిగా రవీందర్

కొడిమ్యాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని చెప్యాల గ్రామానికి చెందిన అక్కపెల్లి రవీందర్ రెండవ సారి నియా మకమయ్యారు. గతంలో సమాచార హక్కు చట్టంలో పాల్గొన్న అంశాలు, కమిషనర్ ఫిర్యాదులు, పరిష్కారాలను పలు సందర్భాలను దృష్టిలో పెట్టుకొని నేషనల్ అధ్యక్షుడు బండి పట్టాభిరామ్ రైట్ టు ఇన్ఫర్మేషన్ ఏ సొసైటీ(నాన్ పొలిటికల్)అక్కపెల్లి రవీందర్ నవంబరు14, 2025 సంవత్సరంకు కొనసాగింపు ఉత్తర్వులను జారీ చేశారు. ప్రజలను చైతన్య వంతులను చేసేలా మరింత ముందుకు సాగాలని నేషనల్ అధ్యక్షుడు సూచించినట్లు రవీందర్ తెలిపారు.

విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీసేందుకు అబాకస్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు అబాకస్ ఎంతో దోహదపడుతుందని జగిత్యాల మున్సిపల్ చైర్మన్ అడువాలజ్యోతి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో అబాకస్ ఉచిత శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గణిత శాస్త్రంలో మంచి మార్కులు సాధించడానికి అబా కస్, వేద గణితం, స్పీడ్ మ్యాథ్స్‌లాంటి ప్రత్యేక శిక్షణ అవసరమన్నారు. పిల్లలకు చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కల్పించడం ద్వారా వారి భవిష్యత్ బాగుంటుందన్నారు. అడ్లగట్ల గంగాధర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పట్టాల జారీపై ఆశలు



- కొత్త రెవెన్యూ చట్టంలో సాదా బైనామాలకు చట్టబద్ధత కల్పించనున్న సర్కారు
- గత ప్రభుత్వం దరఖాస్తు స్వీకరణ
- సాదా బైనామాల పరిష్కారానికి సర్కారు నిర్ణయం

జగిత్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భూమి క్రయ విక్రయాలకు సంబంధించి తెల్లకాగితాలపై ఒప్పందాలు చేసుకున్న వ్యక్తులు పట్టాలపై ఆశలు పెంచుకుంటున్నారు. కాంగ్రెస్ సర్కారు ధరణి స్థానంలో భూ భారతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడంతో పాటు రెవెన్యూ చట్టం 2024ను ప్రతిపాదించింది. ఈ చట్టంలో సాదా బైనామాలకు చట్టభద్ధత కల్పించే అంశం చేర్చడంతో గతంలో దరఖాస్తు పెట్టుకున్న వారి ఆశలు చిగురిస్తున్నాయి.

జిల్లా వ్యాప్తంగా పెండింగ్ దరఖాస్తుల సంఖ్య ..

జిల్లా వ్యాప్తంగా 35,010 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో అత్యధికంగా మెట్‌పల్లిలో 4,489 దరఖాస్తులు, అత్యల్పంగా జగిత్యాలలో 318 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలోని గొల్లపల్లిలో 1,000 దరఖాస్తులు, సారంగాపూర్ 934, ఇబ్రహీంపట్నం 1,903, బుగ్గారం 984, పెగడపల్లి 1,840, వెల్గటూరు 2,809, మల్లాపూర్ 3,025, కథలాపూర్ 2,757, రాయికల్ 3,104,కొడిమ్యాల 837, జగిత్యాల రూరల్ 1,901, మేడిపల్లి 1,336, బీర్‌పూర్ 1,757, మల్యాల 737, ధర్మపురిలో 2,119 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

బాండ్ పేపర్లపైనే..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎక్కువగా తెల్ల కాగితాలు, బాండ్ పేపర్ల పైనే భూ క్రయ విక్రయాలకు చెందిన అగ్రిమెంట్లు ఉన్నాయి. సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన వారు మోకాపై ఉండడం, అమ్మినవారి పేర్లు పట్టాదారు పాస్‌బుక్‌లలో రావడంతో సదరు భూములు తమవేనంటూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో ప్రభుత్వం సాదాబైనామా ద్వారా కొనుగోలు చేసిన వారికి 2016లో అవకాశం కల్పించింది. జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం వాటిని పరిష్కరించిన తర్వాతే కొత్త దరఖాస్తులు స్వీకరించనున్నట్లు రెవెన్యూ అధికారులు అంటున్నారు.

2020లో బీఆర్ఎస్ సర్కారు ప్రకటన..

2020లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించింది. ఎవరైనా సాధారణ పత్రాలపై క్రయ విక్రయాలు చేసుకుంటే మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సర్కారు సూచించింది. దీంతో జిల్లాలో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. 2019లో కొత్త రెవెన్యూ చట్టం కింద అప్పటి ప్రభుత్వం సాదాబైనామాల దరఖాస్తులను స్వీకరించినా చట్టంలో ఉన్న కొన్ని సాంకేతిక కారణాలతో పట్టాల జారీకి ప్రతికూలత ఏర్పడింది. ఫలితంగా సాదాబైనామాల దరఖాస్తులు నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉంటున్నాయి.

(తరువాయి 8వ పేజీలో)

వైద్యులకు సంపూర్ణ సహకారం

- కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు


కోరుట్లలో వైద్యులతో జువ్వాడి నర్సింగారావు

కోరుట్ల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల, మెట్‌పల్లి వైద్యులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఇస్తా బ్యాంక్వెట్ హాల్‌లో కోరుట్ల - మెట్‌పల్లి అబ్‌స్టెట్రిక్, గైనకాలజిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా (కేఎంవోజీఎస్) కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నర్సింగారావు హాజరై మాట్లాడారు. ప్రభుత్వం వైద్య రంగం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతంలో వైద్య రంగం ఎంతో పురోభివృద్ధి జరుగుతోందన్నారు. గైనిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఏర్పాటు చేసి మహిళా బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉం టామని హామీ ఇచ్చారు. వైద్యులు రోగులను ఆపద సమయంలో ఆదుకుంటూ సేవలు అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. గైనకాలజిస్టు సొసైటీ అధ్య క్షురాలిగా ఎన్నికైన స్వీతీఅనూప్ మాట్లాడుతూ గర్భిణులు, మహిళల పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గైనకాల జిస్టుల సంఘం అధ్య క్షుడు నరసింహారెడ్డి, కార్యదర్శి అరుణసుమన్, కోరుట్ల, మెట్‌పల్లి ఐఎంఏ అధ్య క్షులు రేగొండ రాజేశ్, గంగసాగర్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అనూప్‌రావు, మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, కోరుట్ల, మెట్‌పల్లి వైద్యులు పాల్గొన్నారు.

వార సంతతో ప్రజలకు ఇక్కట్లు

- ఇరుకు స్థలం కావడంతో తప్పని ఇబ్బందులు


సంత స్థలంలో ప్రజలు వర్తకులు

కొడిమ్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కొడిమ్యాల గ్రామంలో ప్రతి గురువారం నిర్వహిస్తున్న వార సంత స్థలం ఇరు కుగా ఉండటంతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజలే కాకుండా చుట్టు పక్కల మండలాల ప్రజలు కూడా వస్తువులను అమ్ముకోవటానికి కొడిమ్యాల వారసంత కు (అంగడికి)వస్తు ఉంటారు. ప్రస్తుతం కూరగాయలు ఎక్కువగా పండటం తో వారం రోజులకు సరిపడే విధంగా కొనుగోళ్లు చేసుకుంటారు. కొడిమ్యా ల గ్రామస్థులు కూడా తమకు అవసరమైన వాటిని కొనుగోలు చేస్తుంటా రు. కూరగాయలు అమ్ముకోవటానికి గ్రామ పంచాయతీ కార్యాలయం ముందున్న స్థలంతో పాటు మహిళలు ఎక్కువగా రోడ్డుపైనే కూర్చుండి అ మ్మకాలు కొనసాగిస్తారు. గ్రామ పంచాయతీ ముందు ఉన్న రోడ్డు, కోనాపూ ర్ రోడ్డు, గాంధీ విగ్రహం చుట్టు, పోలీస్ స్టేషన్ వైపున్న దారులన్నీ ప్రతి గురువారం నడవటానికి ఇబ్బందిగా తయారవుతాయి. ఈ ప్రాంతంలో హోటళ్లను, మందుల దుకాణాలు, కిరాణం దుకాణాలు, నిర్వహించుకునే వారి ముందు కూరగాయలను పెట్టుకొని అమ్ముకోవటం అదే సమయానికి ఆర్టీసీ బస్‌తో పాటు ప్రైవేటు వాహనాలు రావటంతో ఆ ప్రాం తం అంతా ఇరుకుగా మారి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మం డలంలోని తిర్మలాపూర్, దమ్మయ్యపేట, శనివారంపేట, కోనాపూర్, సూరంపేట గ్రామాలకు వెళ్లే వారు, పోలీస్ స్టేషన్ దారివైపు నుంచి బొల్లోని చెరువు, కొండాపూర్ గ్రామాల ప్రజలు ఈ దారి గుండానే వెళ్తుంటారు. కొడిమ్యాల అంగడిలో తాగు నీటి సౌకర్యం, మూత్రశాలల సౌకర్యం ఉన్న ప్పటికీ స్థ లం ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వా ర సంతకు వచ్చి పోయె వారికి ఇబ్బందులు కలుగకుండ అధి కారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కొడిమ్యాల గ్రామ పంచాయతీ ముందున్న స్థలంలోనే ప్రతి ఒక్కరు అమ్మకాలు కొనసాగించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రోడ్డుపై అమ్మకాలు కొనసాగిస్తే ఏదైనా ప్రమా దాలు జరిగే అవకాశం ఉంటుందని ప్రజలు వాపోతున్నారు.

సీఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే


సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే మాకునూరి సంజయ్ కుమార్‌లు

జగిత్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ ఆదివారం హైద్రాబాద్‌లోని జూబ్లిహిల్స్‌లో గల ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. సుమారు గంట పాటు నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పలు అభివృద్ధి, సంక్షేమ అంశాల ప్రతిపాదనలపై సీఎంతో చర్చిం చారు. జగిత్యాల పట్టణంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అవసరముందని, మురుగునీటి శుద్ధి ప్లాంట్ అవసరమని కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని కోరారు. జగిత్యాలలో నవోదయ విద్యాలయం, కేంద్రీయ విద్యాలయం మంజూరుపై చర్చించారు. బీర్‌పూర్ మండలంలో ఏకలవ్య పాఠశాల ఏర్పాటు, కేజీబీవీ పాఠశాల ఏర్పాటు, నిధుల మంజూరు, స్థలం కేటాయింపు అంశాలు, జగిత్యాల రూరల్ మండలానికి కేజీబీవీ పాఠశాల ప్రతిపాదనలు, జగిత్యాలకు మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ చల్‌గల్ వాలంతరీలో ఏర్పాటు చేయాలని కోరారు. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామాన్ని మండలంగా ప్రకటిం చాలని, నూకపల్లి అర్బన్ హౌజింగ్ కాలనీని జగిత్యాల మున్సిపల్‌లో విలీనం చేయాలని, జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్ మండలాల పునర్విభజన చేయాలని కోరారు.

నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో చర్చించిన అంశాలు..

ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిజామబాద్ పార్లమెంట్ పరిధిలో మంజూరు చేసిన జగిత్యాల, నిజామా బాద్ నవోదయ పాఠశాలల ఏర్పాటుకు ఒక్కో చోట సుమారు 20 ఎకరాల భూమిని కేటాయించాల్సి ఉందని సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అర్వింద్ వివరించారు.

రెండు జిల్లాల్లో ప్రతిపాదిత స్థలా లను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. నిజామా బాద్ పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులను వివరి స్తూ..మాదవ్ నగర్ ఆర్‌ఓబీ 50-50 పద్ధతిలో మంజూరు చేశారని, అడివి మామిడిపల్లి ఆర్‌ఓబీ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరు అయినప్పటికీ, గత బీఆర్ఎస్ సర్కారు నిధులను మళ్లించిందని సీఎంకు తెలిపారు. కాంట్రాక్టర్లకు సరియైన సమయంలో బిల్లులు అందడం లేదని, సకాలంలో బిల్లులు మంజూరు అయ్యేలా చొరవ చూపాలని కోరారు. మరోవైపు జగిత్యాల పట్టణంలో కేంద్రీయ విద్యాలయం సైతం మంజూరయ్యే దశలో ఉందని, దీనికి కూడ స్థల అన్వేషణ చేయాలని కోరారు. తమ ప్రతిపాద నలకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందిం చినట్లు ఎంపీ అర్వింద్, మ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌లు తెలిపారు.

అర్హులైన ఉపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించాలి

- ఆర్‌యూపీపీటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా

రాయికల్, డిసెంబరు 22 (ఆంధ్ర జ్యోతి): అర్హులైన 24 సంవత్సరాల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులకు గెజిటెడ్ హోదా కల్పించాలని ఆర్‌యూపీపీటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా అన్నారు. రాయికల్ మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భాషా పండితులపై 2005లో ఆ నాటి ప్రభుత్వం తీసుకువచ్చిన 1/2005 యాక్ట్‌ను రద్దు చేసి స్కూల్ అసిస్టెంట్ హోదాను వర్తింపజేయాలన్నారు. 24 ఏళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులకు గె జిటెడ్ హోదా కల్పించడం ద్వారా ప్రభుత్వానికి ఎలాం టి ఆర్థిక భారం ఉండదన్నారు. పదోన్నతులు రాకుండా మిగిలిపోయిన సుమారు 650 మంది భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలన్నారు. 1927లో ఏర్పడిన రాష్ట్రంలోనే అత్యంత సీ నియర్ ఉపాధ్యాయ సంఘమైన రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్‌కు ప్రభు త్వ గుర్తింపు హోదా కల్పించాలని కోరారు.

ప్రాథమిక పాఠశాలల్లో హిందీని ప్రవే శపెట్టి ప్రాథమిక పాఠ శాలల్లో తెలుగు, హిందీ పండితులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కటుకం నరేందర్, చంద సత్యనారాయణ, రాష్ట్ర ప్రతినిధి వంగపల్లి సంపత్ కుమార్, ప్రాథమిక స భ్యులు వేల్పుల స్వామి యాదవ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులో విద్యుదాఘాతంతో అదే గ్రామానికి చెందిన జంగిటి నవీన్(32) మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజేశ్వర్‌రావుపేట గ్రామానికి చెందిన జంగిటి చిన్న నర్సయ్య అలియాస్ ఇచ్చన్న శనివారం జంతువుల వేట కోసమని గ్రామ శివారులోని మామిడి తోటకు నవీన్‌ను వెంట తీసుకెళ్లాడు. అంతకుముందే చిన్న నర్సయ్య ఎలక్ట్రిక్ తీగకు కరెంట్ షాక్ పెట్టి అక్కడ ఉంచాడు. ఆ విషయం తెలియక నవీన్ అటు వైపు వెళ్లడంతో తీగకు కాలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. తన భర్త చావుకు చిన్న నర్సయ్యనే కారణమంటూ నవీన్ భార్య రజిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్ తెలిపారు. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ పరిశీలించారు.

వ్యాన్ ఢీకొని ద్విచక్రవాహనదారుడి మృతి

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌కు చెందిన గాజుల సత్యనారాయణ(50) అనే వ్యక్తి శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై వెంకట్రావునగర్ నుంచి కొత్త బస్టాండ్ వద్ద యూటర్న్ చేస్తుండగా ట్రావెలర్ వ్యాన్ ఢీకొని తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తున్న సత్యనారాయణ కూతురు వివాహం ఇటీవల జరిగింది. ఆదివారం వధూవరులకు ఓడిబియ్యం కార్యక్రమం నిర్వహించాల్సి ఉండడంతో ద్విచక్రవాహనంపై సెలూన్‌కు వెళ్లి కటింగ్ చేసుకొని తిరిగి ఇంటికి వచ్చాడు. అయితే సెలూన్ వద్ద సెల్‌ఫోన్ మరిచిపోవడంతో తీసుకొని అదేమార్గంలో ఉన్న బంధువులను పిలిచి వస్తానని చెప్పి ఇంట్లోనుంచి ద్విచక్రవాహనంపై సత్యనారాయణ వెళ్లాడు. సిరిసిల్ల కొత్తబస్టాండ్ వద్ద యూటర్న్ చేస్తుండగా కామారెడ్డి వైపు వెలుతున్న టీఎస్ 23, 1126 నంబర్ గల వ్యాన్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఓడిబియ్యం కార్యక్రమం జరగాల్సిన ఇంట్లో యజమాని రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో విషాదం అలుముకుంది. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేట్లు చూస్తామని పోలీసులు హామి ఇవ్వడంతో ఆందోళన సద్దుమనిగింది. మృతుడు సత్యనారాయణకు భార్య అరుణ, కూతురు, కుమారుడు ఉన్నారు. సంఘటనపై ఇల్లంతకుంట మండలంలోని జగ్గారెడ్డిపల్లికి చెందిన విలాసాగరం వేణు అనే వ్యాన్ డ్రైవర్‌ను అరెస్ట్ చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

మల్లాపూర్, డిసెంబరు, 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొర్రెపల్లి గ్రామానికి చెందిన తోట రాజం(60) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజం కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రిల్లో వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఆదివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజం భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీ ఘటనలో ముగ్గురి అరెస్టు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో జరిగిన పలు చోరీ ఘటనల్లో కామారెడ్డి జిల్లా కామారెడ్డి, మాచారెడ్డి, ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులు అర్జున్‌సింగ్, శ్రీకాంత్, గంగయ్యను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ రమాకాంత్ ఆదివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన దాసరి అజయ్‌కుమార్ తన బైక్‌ను గొల్లపల్లిలో నిలుపగా చోరీకి గురైంది. ఈ నెల 21న మండల కేంద్రంలోని రెండో బైపాస్ రోడ్డులో కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన శ్రీకాంత్ ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకొని విచారించడంతో బైక్‌ను దొంగిలించి కామారెడ్డిలోని అర్జున్‌సింగ్‌కు అమ్మకానికి ఉంచానని అంగీకరించాడు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, వెంకటాపూర్‌లో బైక్‌లను అపహరించడంతో పాటు లచ్చవ్వ ఇంటిలో చోరీకి పాల్పడిన గొల్లపల్లి వడ్డెర కాలనీ వాసి గంగయ్యను అదుపులోకి తీసుకుని విచారించారు. వెండి, బంగారు ఆభరణాలను అమ్ముకున్నానని వెల్లడించారు. రెండు ద్విచక్రవాహనాలు, నగదు స్వాధీనపర్చుకుని అర్జున్‌సింగ్, శ్రీకాంత్, గంగయ్యను అరెస్ట్ చేశామని ఎస్‌ఐ రమాకాంత్ వివరించారు.

రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన ఒకరి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యంను అక్రమంగా విక్రయించేందుకు నిల్వ చేసిన సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేటకు చెందిన అనంతుల శ్రీనివాస్‌ను ఆదివారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రేషన్ బియ్యంను ఇంట్లో అక్రమంగా నిల్వచేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాడని తెలుసుకున్న టౌన్ ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించగా 94 క్వింటాళ్లలో 39.54క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి శ్రీనివాస్‌ను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరిచామని తెలిపారు.

ఉపాధి కోసం.. ఊరూరా సంచారం

● ధనుర్మాసంలో గంగిరెద్దులవారి సందడి
● బసవన్నల విన్యాసాలు ● సంక్రాంతి వరకు పర్యటనలు

ధనుర్మాసంలో బసవన్నల సందడి ఎక్కువగా కనిపిస్తుంది. గంగిరెద్దుల వాళ్లు జీవనోపాధి వెతుక్కుంటూ ఊరూరా తిరుగుతారు. బసవన్నలను ఆడిస్తూ జనం ఇచ్చే డబ్బులు, ధాన్యం తీసుకుంటారు. బసవన్నల విన్యాసాలతో చిన్నాపెద్దను అలరిస్తారు. ఇలా ఏటా ఆరు నెలలపాటు గ్రామాల్లో సంచారం చేస్తూ మిగతా సమయాల్లో తమకున్న కొద్దిపాటి వ్యవసాయంతో కాలం వెల్లదీస్తారు. ఇంతకుముందులా జనం ఆదరణ లేకపోయినా.. బసవన్నల పోషణ భారమైనా కొంతమంది సంప్రదాయంగా వస్తున్న వృత్తినే అనుసరిస్తూ వస్తున్నారు.





(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ధనుర్మాసంలో సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశిస్తూ తెచ్చే కాంతులతో పల్లెల్లో పండుగ వాతావరణం కనిపిస్తుంది. ఈ సమయంలో గంగిరెద్దుల వాళ్ల నాదస్వరంతో పాడే పాటలు, తబలా వాద్యం రంగు రంగుల దుస్తులతో బసవన్నలకు చేసే అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. విన్యాసాలతో చిన్న పిల్లలు, పెద్దలను అలరించే గంగిరెద్దులు సంక్రాంతి పండుగకు ప్రత్యేక శోభను తెస్తాయి.

ముఖ్యంగా సంక్రాంతి పండుగకు రైతుల కష్టం ఇంటికి చేరుతుంది. ధాన్య రాశులతో పల్లెల్లో ఇళ్ల వద్ద సందడి కనిపిస్తుంది. ధనుర్మాసం ప్రారంభంతోనే గంగిరెద్దుల వారు కూడా ఉపాధి వెతుక్కుంటూ బయల్దేరుతారు. మూడు నాలుగు కుటుంబాలు కలిసి గ్రామానికి చేరుకుంటాయి. ఊరి పెద్దను కలిసి ఇంటింటికీ తిరుగుతారు. ఆరు నెలల పాటు బసవన్నలతో పల్లెపల్లె తిరుగుతారు. గంగిరెద్దుల విన్యాసాలు చేయిస్తారు. చిన్నాపెద్దను అలరిస్తారు. ఇలా ప్రదర్శనిలిచ్చి ఆ ఊరు జనం ఇచ్చే ధాన్యం, డబ్బులు, పాత దుస్తులు తీసుకెళ్తారు.

ప్రత్యేక అలంకరణ

బసవన్నలను రకరకాల దుస్తులతో అలంకరిస్తారు. గంగిరెద్దుల వారు కూడా సన్నాయి, బూర, డోలు, చేతిలో కంచుతో చేసిన చిన్న చేగుంట, నెత్తిన రంగుల తలగుడ్డా, మూతి మీద కోరమీసాలు, చెవులకు కమ్మల జోడు, నల్లకోటు, భుజం మీద కండువా, చేతికి వెండి మురుగులు, నోసట నామాలతో ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తారు. బసవన్న నోటిలో తమ మెడను ఇరికించి చూపిస్తారు. వాయిద్యానికి అనుకూలంగా గజ్జెలతో బసవన్న కూడా నృత్యం చేస్తాడు. గంగిరెద్దుతోపాటు గొర్రె పొట్టేలుతో కూడా రకరకాల విన్యాసాలు చేయిస్తారు.

గంగిరెద్దులవారి జీవన శైలి

గంగిరెద్దుల వాళ్లలో మగవాళ్లు ఆరు నెలల పాటు పల్లెలో సంచారం చేస్తూ బసవన్నను ఆడిస్తారు. ఈ సమయంలో మహిళలు దువ్వెలను, పిన్నీసులు, పౌడర్లు వంటి అలంకార సామగ్రిని గంపలో వేసుకొని గ్రామాల్లో తిరిగి విక్రయిస్తారు. మిగతా ఆరునెలలపాటు తమకు ఉన్న కొద్దిపాటి వ్యవసాయం ఇతర పనులు చేసుకుంటూ బసవన్నల పోషణను చూసు కుంటారు. గంగిరెద్దుల వారు పెద్దగా ఆర్భాటాలను పట్టించుకోరు. వారి వివాహాలు చిన్న వయస్సుల్లో జరుగుతుంటాయి. ముఖ్యంగా మేన కోడలును పెళ్లి చేసుకుంటారు. బతకడానికి అవకాశం ఉంటే పిల్లను ఇవ్వడానికి వెనుకాడరు. కట్నంగా కుక్కలు, గంగిరెద్దులను ఇచ్చుకుంటారు.

ప్రతీ గ్రామం తిరుగుతాం

పర్శరాములు



గంగిరెద్దులతో ప్రతీ గ్రామం తిరుగుతాం. పెద్ద వాళ్లను కలుస్తూ ధాన్యాన్ని సేకరించుకుంటాం. ఒకప్పుడు ఆరు నెలలపాటు సంచారం చేసే వాళ్లం. ఇప్పుడు ఆదరణ కరువైంది. ధనుర్మాసంలో నెల రోజులపాటు తిరుగుతున్నాం. ఊరూరా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

ఆటను కాపాడుకుంటున్నాం

నాంపల్లి



ప్రతీ గ్రామంలో పెద్ద మనుషులు, సర్పంచులను కలిసి గంగిరెద్దుల ఆటను ఏర్పాటు చేసుకుంటాం. గంగిరెద్దుల ఆటను చూసి ధాన్యం, డబ్బులు ఇస్తారు. గతంలోలా ఇప్పుడు గంగిరెద్దుల ఆటను చూడడం లేదు. ప్రతీ సంవత్సరం సంచారం చేస్తూ ఆటను కాపాడుకుంటున్నాం.

వస్తువులు అమ్ముకుంటాం

గంగ రాజవ్వ



మా మగవాళ్లు గంగిరెద్దులతో ఊళ్లోకి వెళ్తే మేము దువ్వెనలు, కాటిక డబ్బాలు, ఇతర వస్తువులు అమ్ముకుంటాం. ఊరూరు తిరుగుతాం. గతంలోలా ఎవరూ కొనడం లేదు. బతుకు భారంగా ఉంది. మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

అటవీ భూముల ఆక్రమణకు యత్నం

- అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఆత్మకూర్ గ్రామస్థులు



అధికారులతో మాట్లాడుతున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామ శివారులోని అటవీ భూముల ఆక్రమణకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఆదివారం ఆందోళన చేపట్టారు. గ్రామస్థులు చదును చేసిన అటవీ భూమిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. అటవీ భూమి చుట్టున్న పాటిమీదతండా గ్రామానికి సంబంధించిన వారితో పాటు ఇతర గ్రామస్థులు వందల ఎకరాల భూమిని కబ్జా చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని గ్రామస్థులు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. కొన్ని రోజుల నుంచి తాము ఫిర్యాదులు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ప్రశ్నించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ కొన్నిరోజుల నుంచి సుమారు వంద ఎకాల వరకు అటవీ భూమిలో ఉన్న చెట్లను తొలగించి సాగుకు చదును చేస్తున్నారని తెలిపారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఆందోళన బాట పట్టామన్నారు. అటవీ భూమి అన్యాక్రాంతం కాకుండా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకుని అడవులను కాపాడాలని గ్రామస్థులు కోరారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలపడంతో గ్రామస్థులు అక్కడి నుంచి తిరిగి వెళ్లారు.

పొలాసలో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

జగిత్యాలరూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస గ్రామంలో ప్రమాదవశాత్తు ఓ ఇంటికి మంటలు అంటుకొని దగ్ధమై భారీగా నష్టం వాటిల్లింది. పొలాస గ్రామానికి చెందిన ఎడెల్లి గంగారాజం కుటుంబసభ్యులు గొల్లపల్లి మండలం మల్లన్నపేటలోని మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు వెళ్లారు. ఈ సమయంలోనే ఘటన చోటు చేసుకుంది. ఇంట్లో దేవుడి దగ్గర పెట్టిన దీపం నుంచి పక్కనే ఉన్న టవల్‌కు మంటలు అంటుకుని ప్రమాదం జరిగినట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దీపం కారణంగా ప్రమాదం జరిగిందా.. లేదా షార్ట్‌సర్క్యూట్‌తో జరిగిందా తెలియాల్సి ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరులేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. కేశవపట్నం ఎస్‌ఐ కొత్తపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంబాలాపూర్ గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మానకొండూర్ మండలం వేగురుపల్లి గ్రామానికి చెందిన మామిడి రంగస్వామి టీఎస్02యూసీ7303 అనే ట్రాక్టర్, టీఎస్02 యూసీ7341 అనే ట్రాలీలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడు. వాహనాలను ఆపి తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

భగత్‌నగర్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో రాష్ట్ర మహాసభల కరపత్రాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 25 నుంచి 28 వకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, జిబీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యుడు ఎడ్ల రమేష్, నాయకులు జి తిరుపతినాయక్, గజ్జల శ్రీకాంత్, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్, పూలేను స్ఫూర్తిగా తీసుకోవాలి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

గోదావరిఖని, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపూలేలను స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు కాసిపేట లింగయ్య, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఆల్‌ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గోదావరిఖనిలో పూలే, అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాసిపేట లింగయ్య మాట్లాడుతూ చదువు ఒక్కటే జ్ఞానాన్ని అందిస్తుందని, ప్రతి ఒక్కరూ చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే భారత ప్రజలకు రక్షణ కవచంగా ఉందన్నారు. కార్యక్రమంలో సింగరేణి ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు పులి మోహన్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, న్యాతరి రాయమల్లు, కొంకటి లక్ష్మణ్, మంతెన లింగయ్య, బత్తుల శంకర్, ఇరుగురాల కృష్ణయ్య పాల్గొన్నారు.

హత్య కేసులో దర్యాప్తు ముమ్మరం

ధర్మపురి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేరెళ్ల సమీపంలోని అటవీ ప్రాంతంలో ఇటీవల ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాహుల్‌ప్రకాశసింగ్ హత్య కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. హత్య చేసి శవాన్ని కాల్చి వేసిన బూడిద, ఎముకలను జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆదివారం పరిశీలించారు. రాహుల్‌ప్రకాశ్‌సింగ్‌ను మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన నేరేళ్ల గోపాల్, నేరేళ్ల గ్రామానికి చెందిన గండికోట శేఖర్ బండరాయితో కొట్టి చంపి శవాన్ని కాల్చి బూడిద చేశారు. ఆదివారం కాలిన బూడిద, ఎముకలను పోలీసులు సేకరించారు కొన్ని ఆధారాలు సేకరించి పక్కటెముకలు, వెన్నెముక భాగాలను సేకరించి హైదరాబాద్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. వైద్యాధికారి శ్రీనివాస్ నేతృత్వంలో పోస్టుమార్టం చేసి బూడిద, ఎముకలను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. హత్య కేసులో ఇద్దరిని పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. ధర్మపురి సీఐ రాజనర్సింహారెడ్డి, ఎస్సైలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.



ఎముకలు సేకరిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

ఉపముఖ్యమంత్రి ఆదేశాలు బేఖాతర్



పెద్దపూర్ గురుకుల పాఠశాల

● గురుకులాల్లో కానరాని కలెక్టర్, డీఎంహెచ్‌వో రాత్రి బస
● మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటనలు అసలే లేవు..
● ఇంటర్, పది తరగతులు మినహా ఇతర విద్యార్థులు ఇంటికి..

జగిత్యాల, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'పెద్దాపూర్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం ప్రభుత్వాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది.. అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పెద్దాపూర్ గురుకుల పాఠశాల సందర్శనకు వచ్చాను.. ఇక నుంచి గురుకుల పాఠశాలలో నెలలో ఒక రోజు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని నిర్ణయించాము.. ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా కలెక్టర్లు, డీఎంహెచ్‌వోలు నెలలో ఒక రోజు ఒక గురుకుల పాఠశాలలో రాత్రి బస చేయాలి' ఇవి ఈ యేడాది ఆగస్టు 13వ తేదీన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు పాముకాటుకు గురై మృతి చెందిన నేపథ్యంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాఠశాలను సందర్శించి న సందర్భంగా అన్న మాటలు..

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాటలు కార్యరూపం దాల్చలేదు. జగిత్యాల జిల్లాలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించిన సందర్భంగా తల్లిదండ్రులు, విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పలు హామీలు, సలహాలు, సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. ఆయన పర్యటన జరిగి నాలుగు నెలల గడిచినప్పటికీ గడుస్తున్నా ఆ ఆదేశాలు మాత్రం అమలు కావడం లేదు. గురుకులాల్లో పనిచేసే వార్డెన్స్, టీచర్స్, పారామెడికల్ సిబ్బంది రాత్రి సమయాల్లో విద్యార్థులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. నెలలో ఒకసారి కలెక్టర్, డీఎంహెచ్‌వో ఒక గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో రాత్రి బసచేస్తారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గడిచిన నాలుగు నెలల్లో జిల్లాలోని ఏ ఒక్క గురుకుల పాఠశాలలో అధికారుల రాత్రి బస, ఎమ్మెల్యేలు, మంత్రుల గురుకుల పాఠశాల సందర్శన జరగకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిలో మార్పు కనిపించకపోవడంతో విద్యార్థుల అస్వస్థతకు గురవుతున్న, పాముకాటు అనుమానాల వంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయన్న ఆరోపణలున్నాయి. పిచ్చిమొక్కలు తొలగించడం, చెత్తాచెదారం ఏరివేయడం, చిన్నచిన్న రిపేర్లు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తూ అధికారులు కొద్దిరోజులు హడావుడి చేసి తరువాత పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. పాఠశాల ఆవరణలో కొత్తగా నిర్మించిన భవనంలోకి తరగతులు, వసతిని మార్చినా శిథిలావస్థలో ఉన్న గదులను తొలగించలేదు.

పాఠశాలలో పారామెడికల్ సిబ్బందిని ఒకరిని నియమించినప్పటికీ సంబంధిత ఉద్యోగికి విద్యార్థుల వసతికి దూరంగా ఉన్న ఓపాత గదిని కేటాయించడంతో రాత్రి వేళలో అందుబాటులో ఉండడం లేదనే విమర్శలున్నాయి. విషపురుగులు, పాములు సంచరిం చే ప్రమాదమున్న ప్రాంతాలను దాటుకుంటూ సంబంధిత పారామెడికల్ ఉద్యోగి ఉండే గది వద్దకు వెళ్లాలంటే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

● చుట్టు పక్కల ప్రాంతాల్లో పంట పొలాలు..

పెద్దాపూర్ గురుకుల పాఠశాల చుట్టు పక్కల ప్రాంతాల్లో పంట పొలాలు ఉండడంతో విష పురుగులు, పాములు అక్కడి నుంచి అప్పుడప్పుడు పాఠశాలలోకి ప్రవేశిస్తున్నాయి. ప్రతీయేటా వరి కొయ్యలను తగులబెట్టినప్పుడు కానీ, పంటలకు విపరీతంగా మందులను పిచికారి చేసినప్పుడు కానీ విషపురుగులు ఇతర ప్రాంతాలకు వెళ్లే వీలుంది. ప్రతీ యేటా చుట్టు పక్కల గల వ్యవసాయం చేసుకునే రైతులతో గురుకులపాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు అవగాహన సమావేశం ఏర్పాటు చేస్తుండేవారని, యేడాదిన్నరగా ఎలాంటి సమావేశాలు జరగడం లేదని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఈనెల 19వ తేదీన రాత్రి ఇంటర్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. పాఠశాలలో రాత్రి సమయంలో బోండాలు అల్పాహారంగా అందించడంతో అవి తిన్న అనంతరం ఓ విద్యార్థి వాంతులు, మరో ఇద్దరు విద్యార్థులు కడుపునొప్పితో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. వెంటనే విద్యార్థులకు ప్రాథమిక వైద్యం అందించారని, ప్రస్తుతం విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నట్లు సిబ్బంది తెలిపారు.

ఈ యేడాది జూలై 26వ తేదీన పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న రాజారపు గణాదిత్య తీవ్రఅస్వస్థతకు గురయి మృతి చెందాడు. పాముకాటు కారణంగా గణాదిత్య మృతి చెందినట్లు ప్రచారం జరిగింది. తల్లి రాజారాపు లావణ్య, తండ్రి మహేశ్ పేదతరగతికి చెందిన వారు. వీరి పెద్దకుమారుడు పుట్టిన మూడు రోజులకు అనారోగ్యంతో మృతి చెందాడు. రెండో కుమారుడు గణాదిత్య పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో చదువుకుంటూ పాముకాటుకు గురై మృతి చెందాడు. మూడో కుమారుడు రవికుమార్ తన మూడేళ్ల వయస్సులో తీవ్ర జ్వరంతో బాధపడుతూ మృతి చెందాడు. ముగ్గురు కొడుకులను కన్నప్పటికీ వివిధ కారణాల వల్ల ముగ్గురు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు పడుతున్న వేదన వర్ణణాతీతంగా మారింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ ప్రకారం తండ్రి మహేశ్‌కు కోరుట్ల

● అంతంత మాత్రంగానే సాయం..

మండలం కల్లూరు మోడల్ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై అటెండర్ ఉద్యోగం ఇచ్చారు. కానీ రెండున్నర నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు వేతనం చెల్లించకపోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. అద్దె ఇంట్లో ఉంటున్న వారికి ఇందిరమ్మ ఇంటి కింద రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించినప్పటికీ ఆదిశగా ప్రయత్నాలు ప్రారంభం కాలేదు. గణాదిత్య మృతిచెంది సుమారు నాలుగున్నర నెలలుగా గడుస్తున్నప్పటికీ పోస్టుమార్టం రిపోర్టును అధికారులు ఇవ్వడం లేదు. ప్రతీనిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని, పోస్టుమార్టం రిపోర్టు ఇవ్వడం లేదని గణాదిత్య తల్లి లావణ్య వాపోతోంది. తమ కుమారుడు ఏ కారణంగా మృతి చెందాడో..పోస్టుమార్టం రిపోర్టులో తెలిసే వీలుంటుందని, అధికారులు రిపోర్టు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తోంది. ఇప్పటికైనా సర్కారు కనికరించి ఇందిరమ్మ ఇల్లు, తండ్రి మహేశ్‌కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని, పోస్టుమార్టం రిపోర్టు ఇప్పించాలని లావణ్య వేడుకుంటోంది.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తెల్లవారు జామునే కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని, ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్‌దర్శనం, కోడెమొక్కు క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు శ్రీపార్వతిపరమేశ్వరులను దర్శించుకుని తరించారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు తిరుగు ప్రయాణమయ్యారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సూపరిండెంట్ తిరుపతిరావు, ఆలయ ఇన్స్పెక్టర్ రాజేందర్‌లు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


కొండగట్టులో భక్తుల సందడి


అంజన్న ఆలయంలో క్యూలో వస్తున్న భక్తులు


మల్యాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. వారంతపు సెలవు దినం కావడంతో దూర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు ఇతర అధికారులు పర్యవేక్షించారు

మల్లెగుట్టపై మల్లన్న భక్తుల కోలాహలం

మల్యాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): మల్యాల శివారులోని మల్లెగుట్టపై ఆదివారం సట్టి సందడి నెలకొంది. వివిధ మండలాల నుంచి వచ్చిన భక్తులు మల్లెగుట్ట మల్లన్న సన్నిధిలో పట్నాలు, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. నూతనంగా మెట్లదారి అందుబాటులోకి రావడంతో ఇటీవల భక్తుల రాక గణనీయంగా పెరిగినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.



సిరుల తల్లి... సింగరేణి ఒడిలో మరో వసంతం చేరనున్నది. బొగ్గు ఉత్పత్తితో మొదలైన తన జీవన గమనంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నది. ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ క్రమంగా తన మార్గాన్ని సుగమం చేసుకున్నది. కన్నబిడ్డల్లాంటి కార్మికులను కంటికి రెప్పలా కాపాడుకుంటూ.. ఆయా కుటుంబాల సామాజిక, ఆర్థిక ప్రయోజనాలను తన భుజస్కంధాలపై మోస్తోంది. మూడు తరాల వారికి విద్య, వైద్యం, సంక్షేమాన్ని అందిస్తోంది. మానవ పురోగతికి కీలకమైన విద్యుత్ తయారీలో కొత్త అధ్యాయాలను లిఖిస్తోంది. 'సిరుల తల్లి' సింగరేణి సంస్థ సోమవారం తన 136వ పుట్టిన రోజు వేడుకను జరుపుకోనున్నది.



సిరుల తల్లి ఒడిలో.. మరో వసంతం

- బహుళ రంగాలకు విస్తరించిన సింగరేణి
- ఇతర రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తికి ప్రణాళికలు
- రూ.35వేల కోట్ల వార్షిక టర్నోవర్
- నేడు సింగరేణి ఆవిర్భావ దినోత్సవం

గోదావరిఖని, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తయారీకి మూల ఇంధనమైన బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి రారాజుగా నిలుస్తోంది. ఏటా 70మిలియన్ టన్నులు బొగ్గు ఉత్పత్తి చేస్తున్నది. దశాబ్దం క్రితమే విద్యుత్ రంగంలో ప్రవేశించిన సింగరేణి థర్మల్, సోలార్, విండ్ విద్యుత్ ఉత్పత్తి రంగాల్లో కూడా ముందుకు సాగుతున్నది. సంపడ్ స్టోరేజీ ప్లాంట్ల సాంకేతికతను తీసుకువచ్చి విద్యుత్‌ను నిల్వచేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. విద్యుత్, బొగ్గును ఆధారం చేసుకుని హైడ్రోజన్, మిథనాల్ వంటి ఇంధనాల తయారీకి సంసిద్ధమవుతున్నది.

ఇది సింగరేణిలో విప్లవాత్మక మార్పు. వం దేళ్లకు పైగా అనుభవం ఉన్న సింగరేణి దేశంలో బొగ్గు పరిశ్రమలకు సాంకేతిక, సామాజిక దార్శనీకతను అందిస్తున్నది. రాష్ట్రంలోనే కాకుండా ఒడిశాలో కూడా బొగ్గు బ్లాకులను తీసుకుని ఉత్పత్తికి సిద్ధమైంది. ఒడిశాలో కూడా విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి సింగరేణి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నది.

ప్రభుత్వాలకు ఆర్థిక దన్నుగా..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సింగరేణి ఆర్థిక దన్నుగా నిలుస్తోంది. జీఎస్టీ, కోల్ సేస్ తదితర రకాల పన్నుల రూపాల్లో ఏటా రూ.7వేల కోట్లు సింగరేణి ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చేరుతున్నాయి. 49శాతం కేంద్ర ప్రభుత్వం, 51 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటా దామాషాలో అంటే సుమారు 3700కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి, 3300కోట్లు కేంద్ర ప్రభుత్వానికి ప్రతి ఏటా సింగరేణి చెల్లిస్తోంది. అంతేకాకుండా సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి సంవత్సరం రూ.600 కోట్లను కోల్‌బెల్ట్ ప్రభావిత ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చిస్తున్నది. వందల కోట్ల రూపాయలతో మెడికల్ కళాశాలను నిర్మిస్తున్నది.

ఇలా ప్రభుత్వాలు, ప్రాంతాలకు ఉపయోగపడుతున్న సింగరేణి కార్మికులకు కూడా లాభాల్లో 33శాతం వాటా చెల్లిస్తున్నది. బోనస్‌లు, లాభాల వాటాలు, సరాసరిగా రూ.500 కోట్ల నుంచి సుమారు రూ.700 కోట్లు కార్మికులకు వేత నాలు కాకుండా పంచి పెడుతున్నది. ప్రతి సంవత్సరం రూ.35వేలకోట్ల టర్నోవర్‌తో నడుస్తున్న సింగరేణి కాలరీస్ సంస్థ తాను ప్రభుత్వాలకు చెల్లించే పన్నులు కాకుండా సంస్థ లాభాలపై ఆదాయ పన్ను, 40వేల మంది కార్మికుల వేతనాల మీద ఆదాయ పన్ను, జీఎస్టీల రూపంలో వందల కోట్లు పరోక్షంగా ప్రభుత్వాలకు చేరుతున్నాయి.

కాంట్రాక్టు కార్మికులకూ అండగా..

సింగరేణి సంస్థ 40వేల మంది కార్మికులకు ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా ఉపాధి కల్పిస్తుండగా, 30వేల మంది కాంట్రాక్టు కార్మికులను కూడా ఆదరిస్తున్నది. కార్మికుని కుటుంబానికి, పిల్లలకు, పెళ్లి చేసుకుని వెళ్లిన ఆడపిల్లలకు, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం తన ఖర్చుతోనే భరిస్తున్నది. ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే కోటి రూపాయలు పరిహారంగా ఇస్తున్నది. అనారోగ్యంతో కార్మికుడు మెడికల్ అన్‌ఫిట్ అయితే వారసులకు ఉద్యోగం కల్పించి ఆ కుటుంబంలో ధైర్యాన్ని నింపుతున్నది. ఇలా వివిధ రంగాల్లో సింగరేణి అభివృద్ధి చెందుతూ, రాష్ట్ర ప్రగతికి దోహదపడడంలో ప్రధాన భూమిక పోషిస్తున్నది.



కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలోని శ్రీకాలభైరవ స్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో కాలభైరవాష్టమి సందర్భంగా ప్రదోష పూజ అనంతరం పంచామృతాలతో అభిషేకం చేశారు. అష్టమి రోజున కాలభైరవ స్వామి వారికి పూజలు నిర్వహిస్తే మంచి శకునాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నమిలకొండ ఉమేష్, గోపన్నగారి చందు, గర్షకుర్తి శ్రీదర్ తదితరుల ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వడుకాపూర్ విద్యార్థిని ఎంపిక


జన్వితతో ఉపాధ్యాయులు

జూలపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కాట జన్విత జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎలగం మహేందర్ తెలిపారు. తొమ్మిదో తరగతి చదువుతున్న జన్విత పెద్దపల్లిలో ఈనెల 14న నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభను కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 23,24,25 తేదీల్లో మేడ్చల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాపోటీల్లో పాల్గొననున్నట్లు మహేందర్ తెలిపారు. జన్వితను ప్రధానోపాధ్యాయుడు రమేష్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ పోటీల విజేత కరీంనగర్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సీఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలబాలికల విభాగాల్లో విజేతగా కరీంనగర్ జట్లు నిలిచాయి. కరీంనగర్ జిల్లా కేంద్రానికి సమీపంలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి సీఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహిం చారు. ఈ పోటీల్లో బాలుర విభాగంలో సిరిసిల్ల జట్టు, బాలికల విభాగంలో జగిత్యాల జట్టు ద్వితీయ స్థానాల ను సాధించాయి. జిల్లా యువజన క్రీడాధికారి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ యాదగిరి సుజిత్‌రావు, డైరెక్టర్ పొల్సాని శిరీషలు ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసరవేని లక్ష్మణ్, పెటా సంఘం అధ్యక్షులు ఎ శ్రీనివాస్, వాలీబాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, తెలంగాణ రాష్ట్ర ఖో-ఖో సంఘ రెఫరీస్ బోర్డు కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాశ్, పీడీలు బాబు శ్రీనివాస్, ఎ శ్రీనివాస్, తిరుమలేశ్, శ్రీనివాస్, కోచ్ మూల వెంకటేశ్, ప్రేమ్, శ్రీధర్, అశోక్, వీర్‌పాల్, అమర్‌సాయి, దుర్గరాజు, శివాజీ, రాజు, రమేశ్, హరికృష్ణ పాల్గొన్నారు.


కరీంనగర్ బాలికల జట్టుతో అతిథులు

కల్వకుంట్ల కుటుంబానికి కౌశిక్‌రెడ్డి దాసోహం: ఎమ్మెల్సీ

జమ్మికుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కల్వకుంట్ల కుటుంబానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దాసోహం అయ్యాడని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. జమ్మికుంటలో ఇటీవల మృత్యువాత పడిన వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గ సమస్యలపై చర్చించేందుకు స్పీకర్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి సమయం ఇస్తే దాన్ని పక్కన పెట్టి, కేటీఆర్‌కు వత్తాసు పలుకుతూ స్పీకర్‌పై ఫ్లకార్డులు విసరడం సిగ్గుచేటన్నారు. కల్వకుంట్ల కుటుంబానికి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దాసోహం అయ్యాడన్నారు. ఎన్నికల సమయంలో ఇంది రానగర్-శాలపల్లి గ్రామాల మధ్య బీఆర్ఎస్ మీటింగ్‌కు వస్తూ ఇద్దరు రోడ్డుప్రమాదంలో మృతి చెందారని, ఆ సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల చొప్పున ఇస్తానని చెప్పిన కౌశిక్‌రెడ్డి ఇప్పటి వరకు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎన్నికలకు ముందు దళితబంధు రెండోవిడత ఆపింది కౌశిక్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

ధర్మపురి గోదావరి వద్ద మల్లన్న భక్తుల రద్దీ

ధర్మపురి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి గోదావరి నది వద్ద ఆదివారం మల్లన్న భక్తుల రద్దీ పెరిగింది. సట్టి వారోత్సవాలను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. భక్తులు నెత్తి మీద మల్లికార్జున విగ్రహాల పెట్టెను పెట్టుకుని ధర్మపురి క్షేత్రానికి తరలివచ్చారు. అనంతరం గోదావరి నదిలో స్నానాలు చేశారు. అలాగే నదీ జలాలతో విగ్రహాలను శుభ్రం చేసి స్నానఘట్టాల పైన ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఇసుక లింగాల వద్ద ఉంచి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించారు. ఇక్కడి నుంచి తమ గ్రామాల్లో మల్లన్న పట్నాలు వేసుకునేందుకు త్రిశూలం, ఒగ్గు డోలు చేత పట్టుకుని మెడలో పూల దండ వేసుకుని భక్తిపాటలు పాడుతూ భక్తులు విగ్రహాల పెట్టెలతో తిరుగు ప్రయాణం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరి నది వద్ద మల్లన్న భక్తులతో సందడి నెలకొంది. గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన అనేక మంది భక్తులు స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని సందర్శించారు. అనంతరం స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

రైఫిల్ షూటింగ్ పోటీల్లో విద్యార్థినికి పతకం

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన క్రీడాకారిణి కె వర్షిత పతకం సాధించింది. జిల్లా కేం ద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న వర్షిత ఎయిర్ రైఫిల్ విభాగంలో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించి ఐదో స్థానంతో పతకం సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణిని కళాశాల ప్రిన్సిపాల్ నిర్మల, కరీంనగర్ జిల్లా రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేందర్‌రావు, కె ప్రసాద్, కెఎస్ రత్నాకర్ అభినందించారు.

మహిళలు, పిల్లలకు భరోసా

- రాష్ట్రంలో మావోయిస్టులు లేరని చెప్పలేదు
- భరోసా సెంటర్ ప్రారంభోత్సవంలో డీజీపీ డాక్టర్ జితేందర్




భరోసా కేంద్రంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీజీపీ జితేందర్, సిబ్బందితో మాట్లాడుతున్న డీజీపీ

కరీంనగర్ క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భరోసా కేంద్రంతో బాలికలకు, మహిళలకు మరింత భద్రత కలుగుతుందని డీజీపీ డాక్టర్ జితేందర్ అన్నారు. భరోసా కేంద్రాల ద్వారా పోలీసు, వైద్య, న్యాయసేవలు, మానసిక ప్రోత్సాహం ఒకే గూడు కిందకు వస్తాయని ఆయన తెలిపారు. ఆదివారం కరీంనగర్ శివారులోని కొత్తపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరితో కలిసి డీజీపీ ప్రారంభించారు. డీజీపీకి కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి పూల మొక్కతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీజీపీ భరోసా సెంటర్‌లో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం భరోసా సెంటర్‌లో వివిధ విభాగాలు బాధితులకు అందించే సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో భరోసా సెంటర్‌ను వెయ్యి గజాల స్థలంలో అన్ని వసతులతో అద్భుతంగా నిర్మించామన్నారు. భరోసా కేంద్రాల ఏర్పాటు కేవలం తెలంగాణలోనే ఉందని, సుప్రీంకోర్టు బృందం కూడా భరోసా కేంద్రాన్ని పరిశీలించి అభినందించిందన్నారు. ఇతర రాష్ట్ర పోలీసులు ఈ భరోసా కేంద్రాలను సందర్శిస్తున్నారని అన్నారు. లైంగిక వేధింపులకు గురైన మహిళలకు, సురక్షిత వాతావరణంలో చేయూత అందించేందుకే రాష్ట్ర పోలీసుశాఖ, ఉమెన్ సేఫ్టీవింగ్ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ కేంద్రాలు మంచి ఫలితాలనిస్తున్నాయని అన్నారు. భరోసా కేంద్రం ద్వారా పోక్సో కేసుల బారిన పడిన బాధితులకు తక్షణ సహాయం అందించడంతో పాటు ఎఫ్ఐఆర్ నుంచి మొదలుకొని కోర్టుల్లో శిక్షలు పడే వరకు బాసటగా నిలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 27 భరోసా కేంద్రాలు నడుస్తున్నాయని తెలిపారు. భరోసా సెంటర్లలో లీగల్ ఎక్స్‌పర్ట్స్ వైద్యులు, కౌన్సెలింగ్ టీం 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. భవిష్యత్‌లో అన్ని జిల్లా కేంద్రాల్లో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని డీజీపీ తెలిపారు.

పౌరుల భద్రతే ముఖ్యం..

కరీంనగర్ భరోసా కేంద్రంలో ఏడుగురు సిబ్బంది ఉంటారని డీజీపీ అన్నారు. ఇప్పటికే ఐదుగురిని నియమించామని మరిన్ని నియామకాలు త్వరలో చేపడుతామన్నారు. పోక్సో కేసుల్లో శిక్షల శాతం గతంలో కంటే పెరిగిందన్నారు. ఎస్‌బీఐ సీఎస్ఆర్ నిధులతో కరీంనగర్‌లో భరోసా సెంటర్‌ను నిర్మించామని, వారికి డీజీపీ అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ చాలా బాగా పనిచేస్తుందన్నారు. పౌరుల భద్రత కంటే సినిమా ప్రమోషన్ ముఖ్యం కాదని డీజీపీ స్పష్టం చేశారు. అల్లు అర్జున్ సినిమా హీరో అయినప్పటికీ ఆయన బయట సామాన్యుడేనని, క్షేత్రస్థాయిలో పరిస్థితులను అర్థం చేసుకుని మెదలాలన్నారు. వ్యక్తిగతంగా తాము ఎవరికీ వ్యతిరేకం కాదని, పౌరులందరూ బాధ్యతగా మెదలాలని సూచించారు. సంధ్య థియేటర్ ఘటన దురదృష్టకరమని, చట్టం ప్రకారం అల్లు అర్జున్‌పై ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. మోహన్‌బాబుది కుటుంబ గొడవని, వారు కొంత మారారని అన్నారు. జర్నలిస్టుపై దాడి ఘటనలో మంచు మోహన్‌బాబుపై కేసు నమోదు చేశామని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని డీజీపీ తెలిపారు.

రాష్ట్రంలో మావోయిస్టులు లేరని తాము చెప్పలేదని, ఈ మధ్యకాలంలో వారు రాష్ట్ర సరిహద్దులో ఇద్దరిని ఇన్‌ఫార్మర్ల పేరిట చంపారన్నారు. ప్రజాశ్రేయ స్సు దృష్ట్యా ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఫైర్ జరిగిందని డీజీపీ అన్నారు. విలేకరుల సమావేశంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి, పోలీస్ కమిషనర్ అభిషేక్‌మొహంతి, శిక్షణ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫౌరబి, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, భరోసా కేంద్రం ఇన్‌చార్జి ఏసీపీ మాధవి, సీఐ శ్రీలత, ఎస్‌బీఐ అధికారులు పాల్గొన్నారు.

కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం

కరీంనగర్ పోలీస్ కమిషనర్ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన అస్త్ర కన్వెన్షన్ సెంటర్, ది కాప్ కెఫెలను డీజీపీ డాక్టర్ జితేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దిన అస్త్ర ఏసీ కన్వెన్షన్ సెంటర్, ది కాప్ కెఫెలు అధికారులు, సిబ్బందికి అత్యంత తక్కు వ ధరల్లో అందించేలా చర్యలు తీసుకున్నందుకుగాను కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిని అభినందించారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ అస్త్ర కన్వెన్షన్ సెంటర్‌ను కమిషనరేట్ కేంద్రంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్మించామన్నారు. ఈ హాలును సిబ్బంది కుటుంబ శుభకార్యాలకు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు అధికారులు, సిబ్బందికి అత్యంత నాణ్యతతో కూడిన ఆహారం, స్నాక్స్ అల్పాహారం అందించేలా ది కాప్ కెఫెను నిర్మించామన్నారు. సోమవారం నుంచి ఈ రెండు కరీంనగర్ పోలీసులకు అందుబాటులోకి



ప్రభుత్వ ఉద్యోగులకు కేరాఫ్ చెంజర్ల

- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామం
- ఒకే ఊరిలో 150కి పైగా ప్రభుత్వ ఉద్యోగులు

మానకొండూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నాడు కరువు కాటకాలతో సతమతమై నేడు 150కి పైగా ప్రభుత్వ ఉద్యోగులకు చిరునామాగా నిలుస్తోంది మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామం. చెంజర్ల గ్రామం గతంలో కమ్యూనిస్టులకు అడ్డాగా ఉండేది. కాకతీయ కాలువ గ్రామానికి దిగువ నుంచి వెళ్లడంతో సాగునీరు అందక పోయేది. ఎటుచూసినా బీడు భూములే కనిపించేవి. గ్రామస్థులు పనులు లేక భీవండి, ముంబాయి లాంటి ప్రాంతాలకు వలస వెళ్లేవారు.

చదువుతోనే భవిష్యత్తు ఉంటుందని..

తరాలు మారాయి.. చదువుతోనే భవిష్యత్తు బాగుంటుందని నమ్మిన చెంజర్ల యువత పట్టుదలతో చదివారు. 2006 డీఎస్సీలో గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు ఉపాధ్యాయులుగా ఉద్యోగం సాధించారు. అంతే వారి కుటుంబాల పరిస్థితి మారిపోయింది. వారిని స్ఫూర్తిగా తీసుకుని కొత్త తరానికి చెందిన వారు చదువుపై దృష్టి సారించారు. ఏ నోటిఫికేషన్ వెలువడినా ఉద్యోగాలు సాధించిన వారి సూచనలతో ప్రిపేర్ కావడం ప్రారంభించారు. ప్రస్తుతం గ్రామంలో 150 మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. గ్రామంలో 3,067 మంది జనాభా ఉంది. గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు బొల్లబత్తుల అంజనేయులు, మార్కండేయ, శ్రీనివాస్ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యేవారిని ప్రోత్సహించారు. 2012 డీఎస్సీలో ఈ గ్రామానికి చెందిన 18 మంది యువకులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈ గ్రామానికి చెందిన వారు 70 మందికి పైగా ఉపాధ్యాయులుగా ఉద్యోగం చేస్తున్నారు. మరో 80 మంది వివిధ రంగాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా కొనసాగుతున్నారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమే..
బైరి మార్కండేయ, జూనియర్ లెక్చరర్



పట్టుదల ఉంటే ఏదైన సాధించవచ్చు. పట్టుదలతో చదివి 2012 టెట్‌లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాను. తర్వాత డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయాను. ఇటీవల ప్రకటించి జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యాను.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించాను..
సుదగోని స్వప్న, డిగ్రీ లెక్చరర్



మాది వ్యవసాయ కుటుంబం.. తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో పట్టుదలతో చదివాను. 2016లో కరీంనగర్‌లోని డిగ్రీ కళాశాలలో అతిథి లెక్చరర్‌గా పని చేశాను. 2019 ఆగస్టులో సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాను.

ఎట్టకేలకు వంతెన పనులకు మోక్షం

● తక్కళ్లపల్లి-సిరికొండ వంతెన పనులకు ఏర్పాట్లు ● ఆర్‌అండ్‌బీ శాఖతో రద్దయిన టెండర్ పునరుద్ధరణ
● రెండు రోజుల్లో పనుల ప్రారంభం ● ఎమ్మెల్యే చొరవతో పూర్తి కానున్న వంతెన

కథలాపూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఎనిమిదేళ్లగా కొనసా...గుతున్న తక్కళ్లపల్లి - సిరికొండ వంతెన నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభం కానున్నాయి. దాదాపు ఎనభై శాతం పనులు పూర్తి కాగా గత ప్రభుత్వం బిల్లులు అందించక పోవడం, భూములు కోల్పోతున్న రైతులకు సకాలంలో పరిహారం చెల్లించక పోవడం వంటి సమస్యలతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో వర్షాకాలంలో ప్రజలు పడ్డ ఇబ్బందులు వర్ణనాతీతం. కిలోమీటర్ల మేర దూరం అదనంగా ప్రయాణించి తీవ్ర ఇక్కట్లు పడగా నాయకులు ఎవరూ పట్టించుకోలేదు. కాంట్రాక్టర్ చేతులెత్తేసి వెళ్లడంతో పనులకు గ్రహణం పట్టింది.



అర్ధాంతరంగా నిలిచిపోయిన తక్కళ్లపల్లి - సిరికొండ వంతెన

● ఐదేళ్లకు మళ్లీ ముందుకు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ రోడ్డును పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోకి మార్చారు. ఆ సమయంలో పెద్దవాగుపై వంతెన లేక అవస్థలు పడుతున్న కారణంగా రు. 8 కోట్లు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసింది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వంతెన నిర్మాణానికి టెండర్లు పిలవగ శ్రీచక్ర ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ కంపనీ పనులు దక్కించుకుంది. ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల కంటే తగ్గించి (లెస్) పనులు చేజిక్కించుకున్నారు. 2016 అక్టోబర్‌లో కరీంనగర్ అప్పటి ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు పనులకు శంఖుస్థాపన చేశారు. కాంట్రాక్టర్ వాగు మధ్యలో శ్లాబులు వేసి బిల్లులు రావడం లేదనే కారణంగా 2019లో పనులు అర్ధాంతరంగా నిలిపివే శాడు. ఈ వంతెన నిర్మాణంలో దాదాపు ఐదు ఎకరాల భూమి కోల్పోతుండగా అప్పటి ప్రభుత్వం చెల్లింపులో కాలయాపన చేసింది. దీంతో రైతులు కోర్టుకు వెళ్లడంతో మరింత జాప్యానికి కారణమైంది. 2023లో రైతులకు సుమారు రు. 70 లక్షల నష్టపరిహారం చెల్లించారు. పనులు పూర్తి చేయాలని ఈ మధ్యకాలంలో కాంట్రాక్టర్‌కు అటు అధికారులు, ఇటు ప్రజాప్ర తినిధులు చెప్పినా కాంట్రాక్టర్ పెడచెవిన పెట్టడంతో టెండర్‌ను రద్దు చేస్తూ నిర్ణయిం తీసుకున్నారు. అయితే పాత రేట్ల ప్రకారమే పనులు పూర్తి చేస్తానంటూ అగ్రి మెంట్ పునరుద్ధరించునున్నట్టు తెలిసింది. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ చూపడంతో రెండు రోజుల్లో పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. యంత్రాలను పని ప్రదేశానికి తరలించామని ఏఈ లక్ష్మీకాంత్ గురువారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

● ఎమ్మెల్యే కృషి మరవలేనిది

లింగంగౌడ్, మాజీ సర్పంచ్. తక్కళ్లపల్లి



గత బీఆర్ఎస్ పాలకులు ఈ వంతెన నిర్మాణానికి పట్టించుకోలేదు. బీమారం, మేడిపల్లి, రుద్రంగి, కొడి మ్యాల మండలాలకు ఈ వంతెన అనుసంధానంగా ఉండగా వర్షాకాలంలో ప్రజలు అవస్థలు పడ్డారు. ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు ప్రారంభంకు ఏ ర్పాట్లు చేయడం శుభ పరిణామం.

● ఏళ్ల నాటి కళ తీరనుంది

మొలిగె శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తక్కళ్లపల్లి



ఎప్పుడెప్పుడాని ఎదురు చూస్తున్న వంతెన నిర్మాణ పనులు ప్రారంభం అవుతుండడంతో ప్రజలకు ఎంతో సౌకర్యం ఏర్పడనుంది. ఏళ్లగా ఎదురుచూస్తున్న కళ సాకారం కాబోతుండడం హర్షణీయం. కాంట్రాక్టర్ నాణ్యతతో కూడిన పనులను తొందరగా పూర్తి చేసి రాకపోకలను కొనసాగించేలా చూడాలి.

ఇంటర్వ్యూ

ట్రాఫిక్ నిబంధనలు బాధ్యతగా పాటించాలి

జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై మల్లేశం



జగిత్యాల అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు ట్రాఫిక్ నిబంధనలు తన బాధ్యతగా భావించి పాటించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తొలగిపోవడంతో పాటు ప్రమాదాలను నివారించవచ్చునని జగిత్యాల ట్రాఫిక్ ఎస్సై బోదాసు మల్లేశం అన్నారు. ట్రాఫిక్ సమస్యలపై 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావించారు.

ఆంధ్రజ్యోతి : పట్టణంలో ప్రధానంగా గొల్లపల్లి రోడ్డు, ప్రధాన ఆస్పత్రి ఏరియాలో ఆక్రమణల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది ?

ట్రాఫిక్ ఎస్సై : ఆక్రమణలు మున్సిపల్ అధికారులతో కలిసి అవసరమైన చోట తొలగించడంతో పాటు చాలా చోట్ల వెనక్కి జరిపిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : టవర్ సర్కిల్ ప్రాంతంలో జనాలు నడవడానికి కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గమనించారా ?

ట్రాఫిక్ ఎస్సై : టవర్ ప్రాంతంలో నిత్యం ఉండే రద్దీ దృష్ట్యా బారీకేడ్లు ఏర్పాటు చేసి ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు అటువైపు రాకుండా నియంత్రిస్తున్నాం. గతంతో పోలిస్తే ఇప్పుడు ట్రాఫిక్ సమస్యలు తక్కువగానే ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : చాలా మంది సిగ్నల్ జంప్ చేయడం వల్ల అమాయకులు ప్రమాదాల బారిన పడుతున్నారు ?

ట్రాఫిక్ ఎస్సై : ట్రాఫిక్ నిబంధనలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతివారం కళాశాలల్లో, జన సామర్థ్యం గల ప్రదేశాల్లో పోలీసు కళాబృందాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ట్రాఫిక్ సమస్యలు తొలగిపోవడానికి ప్రజలు కూడా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి.

ఆంధ్రజ్యోతి : అపోజిట్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి ?

ట్రాఫిక్ ఎస్సై : అపోజిట్ డ్రైవింగ్‌ను నియంత్రించడానికి నిత్యం జరిమానాలు విధిస్తూనే ఉన్నాం. దీంతోపాటు అనేక మందిని ఆపుతూ అపోజిట్ డ్రైవింగ్ వల్ల జరిగే ప్రమాదాలు, కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలు తమ బాధ్యగా భావించి అపోజిట్ డ్రైవింగ్ మానివేయాలి.

జాతీయ అవార్డుల అందజేత

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్, 22 (ఆంధ్రజ్యోతి) : మెట్‌పల్లి మండల పశు వైద్యాధికారి డాక్టర్ మనీషాపటేల్‌కు జాతీయ స్థాయి అవార్డు దక్కింది. ఆదివారం యాదగిరి గుట్టలో గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ నిర్వహించిన జాతీయ సదస్సులో కిసాన్ సేవ రత్నా జాతీయ అవార్డును అందుకున్నారు. పశు సంపదపై రైతులకు అవగాహన కల్పిస్తూ చేస్తున్న సేవలను గుర్తించి కిసాన్ సేవ రత్నా జాతీయ అవార్డును నిర్వాహకులు అందజేశారు.

సారంగాపూర్ : మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన బండారి విజయ వెంకటేష్ ఉత్తమ రైతు దంపతులకు పుడమి పుత్ర అవార్డులను గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ వారు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలు వురు మండల నాయకులతో పాటు రైతులు ఆదర్శ రైతు దంపతులను అభినందించారు.





అవార్డు అందుకుంటున్న పశువైద్యాధికారి మనీషాపటేల్, రైతు దంపతులు విజయ వెంకటేష్

పట్టాల జారీపై ఆశలు..

(5వ పేజీ తరువాయి)

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దరణి స్థానంలో భూభారతి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడంతో పాటు రెవెన్యూ చట్టం 2024ను ప్రతిపాదించింది. ఈ చట్టంలో సాదాబై నామాలకు చట్టబద్ధత కల్పించే అంశం చేర్చడంతో గతంలో సాదాబైనామాలకు పట్టాలు జారీ చేయాలని, దరఖాస్తు చేసుకున్న వారిలో ఆశలు చిగురిస్తున్నాయి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ ధరలు అధికంగా ఉండటంతో చిన్న సన్న కారు రైతులు సాదాబైనామా లకు చట్టబద్ధత కల్పించే ప్రక్రియ కోసం ఎదురుచూస్తున్నారు. 2019 నుంచి వ్యవసాయ భూములు రిజిస్ట్రేషన్‌లు రెవెన్యూ కార్యాలయాల్లో సాగుతుండగా అంతకు ముందు రిజిస్ట్రేషన్ చేసుకున్న వాటికి రెవెన్యూ అధికారులు మ్యుటేషన్ చేసి పట్టాలను జారీ చేసేవారు. ఈ తంతు వల్ల వ్యవసాయ భూములు కొనుగోలు చేసిన వారికి పట్టాల జారీలో తీవ్ర జాప్యం ఏర్పడేది. కొత్త రెవెన్యూ చట్టం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం సాదా బైనామాలకు మోక్షం కల్పించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల మొర ఆలకించి కొత్త చట్టం ద్వారా సాదా బైనామాలకు పట్టాలను జారీ చేసే విషయాన్ని తెరపైకి తీసుకొచ్చింది.

●మంచి నిర్ణయం తీసుకుంది

గాజెంగి నందయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జగిత్యాల



సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం ప్రతిపాదించడం మంచి నిర్ణయమే. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినప్పటికీ రేవంత్‌రెడ్డి సర్కారు ఏర్పడిన ఏడాదిలోగా ప్రధాన సమస్యకు పరిష్కారం చూపనుంది. ఎంతో మందికి సాదాబైనామాలకు పట్టాలు జారీ చేసే అవకాశం లభించనుంది.

●రైతులు రుణ పడి ఉంటారు

అల్లూరి మహేందర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్



సాదా బైనామాలకు పట్టాలను జారీ చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సీఎం రేవంత్ రెడ్డికి రైతులు రుణ పడి ఉంటారు. సాదాబైనా మాలకు పట్టాల జారీ కోసం నాలుగేళ్లగా ఎంతో మంది ఎదురుచూస్తున్నారు. వారందరికి తొందరలోనే పట్టాలు జారీ అయ్యే పరిస్థితి ఏర్పడింది.

ఉచిత వైద్య శిబిరం

కొడిమ్యాల, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గౌరాపూర్ గ్రామంలో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సహకారంతో కరీంనగర్ పట్టణంలోని మెడికవర్ ఆసుపత్రివారు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 120 మందికి వైద్యులు అవసర మున్న షుగర్, బీపీ, టుడీకో, పరీక్షలను చేశారు. ఈ శిబిరంలో మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ఆసుపత్రి వైద్యులు, మల్యాల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ గౌడ్, గ్రామ ప్రముఖులు బండ భాస్కర్‌రెడ్డి, వెంకటిరెడ్డి, రాజ మల్లయ్య, అంజయ్య, రమేష్, రవీందర్, శ్రీనివాస్, నాగభూషణం ఉన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని హబ్సీపూర్ గ్రామంలో ఆదివారం శ్రీవేద హస్పిటల్ డాక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్‌క్యాంపు నిర్వహించారు.

ఈసందర్భంగా 250 మంది రోగులకు బీపీ, షుగర్‌తో పాటు ఇతరవ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, వైద్యురాలు శిరీష, ఆర్ఎంపీ గణేష్, తిరుమలచారి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్లూరు కాలనీ సమస్యలు పరిష్కరించండి

కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నర్సింగరావుకు వినతి

కోరుట్ల రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కల్లూరు శివారులోని ప్రెస్టీజ్ కాలనీలో మురికి కాలువలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నర్సింగరావుకు ఆదివారం వినతి పత్రం అందించారు. వర్షాకాలంలో సమీప వ్యవసాయ భూములు, గుట్టల నుంచి వరద ప్రవాహం వస్తుండడంతో కాలనీలో నీళ్ల నిలిచి దుర్గంధం వెద జల్లుతుందని పేర్కొన్నారు. కాలనీలో దోమలు విజృంభించి జ్వరాలతో బాధపడుతున్నామని వాపోయారు.

డ్రైనేజీని కాలనీ నుంచి బయటకు తీసుకు వెళ్లే చర్యలు తీసుకోవాలని కోరారు. తడి, పొడి చెత్తను వేరు చేయడానికి ప్రతీ నిత్యం ట్రాక్టర్‌ను పంపించే ఏర్పాట్లు చేయాలని కోరారు.



జువ్వాడి నర్సింగరావుకు వినతి పత్రం అందిస్తున్న కాలనీ వాసులు

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయికల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం రాత్రి అయ్యప్ప ఉత్తర నక్షత్ర ఆరాధన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప దీక్షాపరులు భక్తిశ్రద్ధలతో భజనలు చేశారు. అనంతరం ఆలయంలో భక్తులు దీపోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు మునుగోటి సత్యనారాయణ శర్మ, సాయి సుధీర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న వేద పండితులు

కరాటేలో గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులు

కొడిమ్యాల, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంద్రల్లపల్లిలోని కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు కరాటేలో గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ బరిగె లక్ష్మీరాజం తెలిపారు. ఈ నెల 15న హైదరాబాదులో జాతీ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో దొంతరవేణి పూజ, పాయికారి ప్రణీత, బరిగె రిషిత, బొమ్మనవేణి వర్షిణి, బుర్ర అర్చన, గుండు ఐశ్వర్య, కాసాని వైష్ణవి, గరిగంటి హాసిని, కొలకాని అక్షయ పాల్గొని ప్రతిభ కనబరిచారు. మండల కేంద్రంలోని విజ్‌డమ్ పాఠశాలకు చెందిన పీసరి నీహాల్, జిడిగె వివేక్, గోనెపల్లి మణిదీప్, పుల్ల సుశాంత్, ఇండో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన హర్షవర్ధన్, శారద, సిద్దార్థ గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జగిత్యాల క్రీడాకారులు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) ఈ నెల 27 నుంచి హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు జగిత్యాలకు చెందిన పలువురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్ తెలిపారు. ఈ నెల 20వ తేదీన జగిత్యాలలో జరిగిన సీఎం కప్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ఈ క్రీడాకారుల ఎంపిక పట్ల కోచ్ విశ్వప్రసాద్, పిడిలు నిరంజన్, రవికుమార్, కృష్ణప్రసాద్, అజయ్, సాగర్‌లు అభినందించారు.

భూ భారతితో రైతులకు రెవెన్యూ సేవలు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ భారతి ఆర్వోఆర్ చట్టంతో రైతులకు రెవెన్యూ మరింతగా చేరువ కానున్నాయని సీనియర్ సిటీజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. అదివారం సీనియర్ సిటీజన్స్ కార్యాలయంలో ఆయన మా ట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించేందుకు నూతన ఆర్వోఆర్ చట్టాన్ని చెచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరిశెట్టి విశ్వనాథం, వెల్మల ప్రకాశ్ రావు పాల్గొన్నారు.

వెంకటస్వామికి ఘన నివాళి

ధర్మపురి, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి) : ధర్మపురి పట్టణంలోని నంది చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వెంకటస్వామి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల రాజేష్, చిలుముల లక్ష్మన్, కౌన్సిలర్ పద్మరవీందర్, రాజేష్, అప్పం తిరుపతి, రఫీయొద్దీన్, సుముఖ్, షబ్బీన్ పాల్గొన్నారు.

కోరుట్ల : మాలల ఐక్యత కోసం కృషి చేసిన పీవీరావు, దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడ్డ గడ్డం వెంకటస్వామి వర్ధంతి వేడుకలను పట్టణంలోని అంబేద్కర్ మాల సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఏబీసీడి వర్గీకరణకు వ్యతిరేకంగా వివేక్ వెంకటస్వామి పోరాటాలు చేశారని గుర్తు చేశారు. అనంతరం వారి చిత్రపటాలకు సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పొట్ట లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి బలిజ సంతోష్, ఉపాధ్యక్షుడు సత్తయ్య కోశాధికారి వేణుగోపాల్, రాష్ట్ర నాయకులు ఉయ్యాల నర్సయ్య, రాజరెడ్డి ఉన్నారు

మల్లాపూర్ ఎస్సైకి సన్మానం

మల్లాపూర్, డిసెంబరు, 22 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ ఎస్సై రాజు ఇటివల బాధ్యతలు స్వీకరించడంతో మాజీ సర్పంచ్ జమాల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. ఆదివారం మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లో ఆయనను మర్యాద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజాప్రతినిధులు, నాయకులు సహకరించాలన్నారు. నాయకులు రవి, క్యాతం వెంకటిరెడ్డి, పనాస రవి, శీలం రవి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని మానస పాఠశాలలో నిర్వహించిన మానస మ్యాథ్స్ టాలెంట్ హంట్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 2156 మంది విద్యార్థులు పాల్గొని గణిత శాస్త్రంలో తమ ప్రతిభను పరీక్షించుకున్నట్టు పాఠశాల ప్రధానోపద్యాయురాలు రంజితరావు తెలిపారు. మనస పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు వర్కింగ్ మోడళ్లను చూసి విద్యార్థుల తల్లిదండ్రులు ఆశ్చర్య పోయారని ఆమె తెలిపారు.

జిల్లా కేంద్రంలోని జ్యోతి పాఠశాలలో జరిగిన జ్యోతి మ్యాథ్స్ ఒలంపియాడ్ టెస్టుకు జిల్లా నలుమూలల నుంచి 2 వేల మంది విద్యార్థులు హాజరైనట్లు పాఠశాల డైరెక్టర్‌లు హరిచరణ్, శ్రీధర్ రావు, మౌనికరావులు తెలిపారు. ఈ పరీక్ష పలితాలను ఈ రోజే విడుదల చేసి ప్రతి తరగతి నుంచి ఎంపికైన ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతులను అందించినట్లు వారు తెలిపారు. తర్వాత స్థానంలో ఉన్న ఐరుగురు విద్యార్థులకు ప్రోత్సా హక బహుమతులు అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అజిత, రజిత విద్యార్థులు, ఉపాద్యాయ బృందం పాల్గొన్నారు.



మానస పాఠశాలలో మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు



జ్యోతి ఒలంపియాడ్‌లో పాల్గొన్న విద్యార్థికి బహుమతి అందిస్తున్న పాఠశాల డైరెక్టర్ హరిచరణ్ రావు

మెట్‌పల్లి టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో ఆదివారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణితానికి సంబంధించిన ప్రాజెక్టులు, ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు శ్రీనివాస రామనుజన్ ఆదర్శంగా తీసుకోని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, నాగేశ్వర చారి, జగపతి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

మేడిపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మేడిపల్లి ఉమ్మడి మండల ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా చింతకింది లక్ష్మిపతి, ప్రధాన కార్యదర్శిగా మార్గం మహేష్, ఉపాధ్యక్షులుగా మహ్మద్ రహీం, దేవయ్య, సహయ కార్యదర్శిగా చిరుమల్ల వజ్రిలింగం, ప్రచార కార్యదర్శిగా కుందారపు ప్రభాకర్, కోషాధికారిగా చిరంజీవి, గౌరవ అధ్యక్షులుగా మహమ్మద్ అఖీల్, నర్సింహరెడ్డి, ఎదులాపురం దయాకర్, గౌరవ సలహదారులుగా మెన్నే ని చంద్రప్రకాష్ రావు, బండ్లకిషన్, కార్యవర్గ సభ్యులుగా రాంరెడ్డి, ప్రవీణ్‌రావు, అంజనేయులు, మహమ్మద్ రఫీ, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలు

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలోని వివేకానందా క్రీడా మైదానంలో జరుగుతున్న సీఎం కప్ ఆటల పోటీలలో బాగంగా ఆదివారం తైక్వాండో, కరటే పోటీలను నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రవి కుమార్ అన్నారు. పేట అధ్యక్షులు విశ్వ ప్రసాద్, అజయ్ బాబు, కోచ్‌లు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల అర్బన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని స్టేట్ టీచర్స్ యూనియన్ కార్యాలయంలో జగిత్యాల జిల్లా శాఖ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతితో కలిసి ఆదివారం ఆవిష్కరించారు. కౌన్సిలర్ చుక్క నవీన్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మచ్చ శంకర్, ప్రధాన కార్యదర్శి భైరం హరికిరణ్, రాష్ట్ర కార్యదర్శులు రవీందర్, శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు

అంజన్న సన్నిధిలో రామ పాదుకలు

మల్యాల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): రామరాజ్యం ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ స్వర్ణపాదుకలు ఆదివారం కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిదానంకు చేరుకున్నాయి. హైదరాబాద్ నుంచి అయోద్యకు తీసుకెళ్లె చిలుకూరి బాలాజీ ఆలయంలో గల శివాలయ ప్రధాన ర్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజు ఆధ్వర్యం లో స్వర్ణపాదుకలను పుణ్యక్షేత్రాల సందర్శనలో భాగంగా కొండగట్టుకు చేరుకోగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పాదుకలను దర్శించుకున్నారు.

కొడిమ్యాల : మండలంలోని నల్లగొండ గ్రామ శివారులోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి ఆదివారం కొండగట్టు గిరి ప్రదక్షణ సంకల్పకర్త శ్రీ సురేష్ ఆత్మరాం మహారాజ్ ఆధ్వర్యంలో శ్రీరామ స్వర్ణపాదుకలు రామదీక్షాపరులతో చేరా యి. హైదరాబాదులోని లంగర్‌హౌజ్ రామాలయం నుంచి ఈ నెల 17న ప్రారంభమైన రామదీక్షాపరుల పాదయాత్ర స్వర్ణపాదుకలు శ్రీరామ నామ జపంతో తీసుకవచ్చారు. అనంతరం ఆలయంలో స్వర్ణ పాదుకలకు ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. రామదీక్షాపరులు, ఆలయ జూనియర్ సహాయకులు రవి, కమలాకర్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

రాయికల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిపెల్లి చర్చిలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. వీరి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, నాయకులు కొయ్యడి మహిపాల్ రెడ్డి, ఎద్దండి దివాకర్ పాల్గొన్నారు.

జగిత్యాల అర్బన్ : అన్ని వర్గాల సంక్షేమం కో సం ప్రభుత్వం కృషి చేస్తున్నదని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని సిఎస్ఐ చర్చిలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రిస్మస్ వేడుకలలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, కౌన్సిలర్ కూతురు రాజేష్, తహసీల్దార్ రాంమోహన్ ఉన్నారు.

కోరుట్ల : పట్టణంలోని జీసస్ క్రైస్ట్ బిలీవర్స్ చర్చ్‌లో ఆది వారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు రంగురంగుల దుస్తులతో ఆటా, పాటలతో అలరించారు. చిన్నారులకు రిటైర్డ్ టీచర్ సత్యమూర్తి పలకలు, నోట్ బుక్కులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. పాస్టర్ సురేందర్ అంజయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

●మల్లాపూర్ : మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి ఆలయ ప్రాంగణంలో నవగ్రహ ఆలయం నిర్మాణానికి కమిటీ నాయకులు భూమి పూజ చేశారు. ఆలయం నిర్మాణానికి అవసరమైన లక్ష ఆరవై వేయిల నగదును రజిత-మల్లేష్ దంపతులు కమిటీ సభ్యులకు అందజేశారు.

జగిత్యాల అర్బన్ : దివ్యాంగులకు ఇచ్చిన హామీల అమ లులో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని జిల్లా దివ్యాంగుల సంఘం నాయకులు అస్కర్ మహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని విమర్శించారు. హామీలను నెరవేర్చకుండా ప్రజాపాలన ఉత్సవాలు నిర్వహించడం సరికాదని అన్నారు.

●కేంద్ర మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అవమానించే విధంగా చేసిన వ్యాఖ్యలను నిరసనగా జిల్లా దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రా సిటీ కమిటీ మాజీ సభ్యుడు దుమాల రాజ్ కుమార్, సీనియర్ నాయకులు బొల్లి శేఖర్, సంపత్ కుమార్, గంగాధర్, టీఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గంగాధర నరేష్ పాల్గొన్నారు.

బుగ్గారం: పార్లమెంటులో అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ, ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ సంఘాల నాయకులు ఆదివారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు.

గొల్లపల్లి: మండలం మల్లన్న పేట గ్రామంలో జరుగుతున్న దొంగ మల్లన్న స్వామి వారి జాతర సందర్భంగా స్వామి వారిని ఆదివారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి దర్శించుకున్నారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

●మండలంలోని మల్లన్న పేట గ్రామంలో ఆదివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ దొంగ మల్లన్న స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాజన్న, మాజీ సర్పంచ్ సిద్దంకి నర్సయ్య, మల్లారెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్లు పాల్గొన్నారు.

కథలాపూర్ : అంబారిపేటలో నేడు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు పిడుగు సంజీ వ్‌రెడ్డి, గడ్డం శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ రేకుర్తి కంటి వైద్యశాల వైద్యులు రోగులను పరీక్షిస్తారని తెలిపారు.